

మోగిన టీచర్ ఎమ్మెల్సీ నగారా..



వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక

- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్.. 27న పోలింగ్.. మార్చి 3న లెక్కింపు..
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10,960 మంది ఓటర్లు, 76 పోలింగ్ కేంద్రాలు
- బీజేపీతో పాటు అభ్యర్థులను ప్రకటించిన ఉపాధ్యాయ సంఘాలు
- పోటీనా..? మద్దతా..? తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు
- ఎన్నికల కోడ్‌తో మూడు ఉమ్మడి జిల్లాల్లో అభివృద్ధి పనులకు బ్రేక్

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ఇలా..

- ఫిబ్రవరి 3వ తేదీ - నోటిఫికేషన్
- ఫిబ్రవరి 10వ తేదీ - నామినేషన్‌లకు చివరి రోజు
- ఫిబ్రవరి 11వ తేదీ - నామినేషన్‌ల పరిశీలన
- ఫిబ్రవరి 13వ తేదీ - నామినేషన్‌ల విత్‌డ్రా
- ఫిబ్రవరి 27వ తేదీ - పోలింగ్ (ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు)
- మార్చి 3వ తేదీ - ఎన్నికల ఓట్ల లెక్కింపు
- మార్చి 8వ తేదీ - ఎన్నికల ప్రక్రియ పూర్తి

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి స్థానానికి ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో ఉపాధ్యాయ వర్గాల్లో సందడి నెలకొంది. ఇప్పటికే ఎమ్మెల్సీ స్థానానికి పలువురు పోటీలో నిల్చున్నారు. ప్రధానంగా బీజేపీ అభ్యర్థిని బరిలో నిలపగా, అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఇంకా ఖరారు చేయలేదు. అభ్యర్థిని నిలపాలా..? లేక ఎవరికైనా మద్దతు తెలపాలా..? అనే సందిగ్ధంలో ఉంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కూడా తమ అభ్యర్థి విషయంలో ఏం నిర్ణయం తీసుకోలేదు. ఈ ఎన్నికల్లో దూరంగా ఉండాలని భావిస్తున్నట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో సుమారు 55కు పైగా ఉపాధ్యాయ సంఘాలు ఉన్నప్పటికీ ప్రధానంగా టీజీయూటీఎఫ్, పీఆర్‌టీయూ, తపస్ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. టీజీయూటీఎఫ్ సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని బరిలో దించుతుండగా, పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. తపస్ మద్దతుతో బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డి పోటీకి దిగుతున్నారు. ఇంకా.. పలువురు స్వతంత్రులుగా పోటీలో దిగుతుండగా.. ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్కంఠగా మారనున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



ఏకశిలాపార్కు నుంచి హరితహోటల్ వరకు ర్యాలీగా వస్తున్న సీపీఐ శ్రేణులు

కమ్యూనిస్టులకు అంతం లేదు..

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి
- ఘనంగా సీపీఐ వందేళ్ల వార్షికోత్సవాలు

న్యూశాయంపేట, జనవరి29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమ్యూనిస్టులను అంతం చేయాలనే ఆలోచనలో ఉందని, ప్రజల పక్షాన నిత్యం పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టులకు అంతం లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. సీపీఐ వందేళ్ల వార్షికోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు నుంచి నక్కలగుట్టలోని హరితకాకతీయ హోటల్ వరకు సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం హరితకాకతీయ హోటల్‌లో పార్టీ వందేళ్ల వార్సికోత్సవ సభ సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగింది. చాడా వెంకట్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం నక్సలైట్ల పేరుతో ఎన్‌కౌంటర్లు చేస్తూ కమ్యూనిస్టులను అంతం చేయాలని చూస్తోందని ఆరోపించారు. నక్సలైట్లను చంపడం దుర్మార్గమైన చర్య అని, ఇప్పటికైనా ఎన్‌కౌంటర్లను ఆపాలన్నారు. మతతత్వ రాజకీయాలతో ప్రజలను రెచ్చగొడితే సహించేది లేదన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూనే ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలని, పేదల కాలనీలలో మౌలిక వసతులు, రోడ్లు, కరెంట్, మంచినీళ్లు వచ్చేంత వరకు పోరాట స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. పేదలకు పట్టాలు ఇచ్చేంత వరకు ఎర్రజెండా పేదలకు అండగా ఉంటుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో పేదలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, అందువల్లనే ప్రజలు మార్పుకోరుకుని కాంగ్రెస్ పార్టీని గద్దెనెక్కించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, లేదంటే పోరాటాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీపీఐ జిల్లా నాయకులు కరుణాకర్, శ్రీనివాస్, రమేష్, ఓదెలు, లింగారెడ్డి, ఎల్లేష్, రాజిరెడ్డి, రాజుగౌడ్, దీనా, సారంగపాణి, వెంకటరమణ, నేదునూరి రాజమౌళితోపాటు పెద్ద సంఖ్యలో సీపీఐ శ్రేణులు పాల్గొన్నారు.

మళ్లీ మాతృశాఖలోకి.!

'గ్రామస్థాయి అధికారుల' నియామకానికి కసరత్తు

- వీఎల్‌వో పోస్టులకు 302, సర్వేయర్‌కు 42 మంది దరఖాస్తులు
- ఈ నెలాఖరులోగా భర్తీ అవుతాయని అంచనా
- 'భూ భారతి'కి వెన్నుదన్నుగా వీఎల్‌వో, సర్వేయర్లు



కేసముద్రం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖలో గ్రామ స్థాయి అధికారుల (వీఎల్‌వో) నియామకం కోసం కసరత్తు కొనసాగుతోంది. 2020, సెప్టెంబరు నెలలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రెవెన్యూ శాఖలో అవినీతి, అక్రమాలకు గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో), గ్రామ రెవెన్యూ సహాయకు (వీఆర్ఏ)ల వ్యవస్థే కారణమనే నిందారోపణలతో ఆయా ఉద్యోగులను తొలగించింది. మహబూబాబాద్ జిల్లాలో రెవెన్యూ శాఖలోంచి తొలగించిన 394 మంది వీఆర్వో, వీఆర్ఏలను ప్రభుత్వం దాదాపు మూడేళ్ల అనంతరం 2023, ఆగస్టులో సర్దుబాటు చేసింది. జిల్లాలో మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజన్లు ఉండగా వీటి పరిధిలో 18 మండలాల్లో 287 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో జిల్లాలో 394 మంది వీఆర్వో, వీఆర్ఏలు ఉండగా, వీరిలో కొంతమందిని మాతృశాఖ అయిన రెవెన్యూతోపాటు ఇతర శాఖల్లోకి వారి అర్హతల ఆధారంగా జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, అటెండర్లు, స్వీపర్లుగా కొలువుల్లో చేరారు. తాజాగా ప్రభుత్వ నిర్ణయంతో తిరిగి తమ మాతృశాఖలోకి వచ్చేందుకు 344 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పెట్టుకున్నారు. త్వరలో అమలు చేయబోయే 'భూ భారతి' చట్టంలో భూముల సర్వే, వివరాల నమోదు ప్రక్రియలో నూతనంగా నియామకమయ్యే వీఎల్‌వోలు, సర్వేయర్లు కీలకపాత్ర వహించనున్నట్లు తెలుస్తోంది.

వీఆర్వో, వీఆర్ఏల స్థానంలో వీఎల్‌వో..

గతంలో ఉన్న గ్రామాల్లో వీఆర్వో, వీఆర్ఏల స్థానంలో వీఎల్‌వోలు పనిచేయనున్నారు. గ్రామస్థాయిలో పనిచేసే వీఆర్వో, వీఆర్ఏలు కీలకమైన బాధ్యతలు నిర్వహించేవారు. ప్రధానంగా భూ రికార్డుల నిర్వహణ, గ్రామంలో నివాస, కులం, ఆదాయం, నివాసం తదితర ధ్రువీకరణ పత్రాలకు క్షేత్రస్థాయిలో విచారణ, ఎన్నికల సమయంలో గ్రామస్థాయిలో అధికారిగా విధులు నిర్వర్తించేవారు. ఏదైనా గ్రామంలో ఘటనలు జరిగిన సమయంలో క్షేత్రస్థాయిలో నివేదికలు ఇవ్వడం, ప్రమాదాలు, విపత్తులు సంభవించిన సమయంలో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం, ఘటనలకు పంచనామ నిర్వహించడం చేసేవారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటనల సందర్భంగా గ్రామంలో ముందస్తు సమాచారం ఇవ్వడం. ఆయా పర్యటనల్లో వారికి సహాయకారిగా ఉం డడం వరకు అనేక కీలకమైన విధులను వీఆర్వో నిర్వహించేవారు. క్షేత్రస్థాయిలో ఇంతకీలకమైన బాధ్యతలు నిర్వహించే వీఆర్వోల్లో కొంత మంది భూ రికార్డుల ప్రక్షాళనలో అనేక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు లేకపోలేదు.

తిరిగి అదే శాఖకే..

రెవెన్యూ శాఖలోంచి ఇతర శాఖల్లోకి అటెండర్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ల పోస్టుల్లోకి వెళ్లిన వారిలో చాలా మంది తిరిగి తమ మాతృ శాఖలోకి వచ్చేందుకు సుముఖత చూపుతున్నారు. జిల్లాలో వివిధ శాఖల నుంచి 344 మంది తిరిగి రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు గత ఏడాది డిసెంబర్ 28 చివరి తేదీతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 302 మంది గ్రామస్థాయి అధికారి పోస్టుకు, 42 మంది సర్వేయర్ పోస్టు కోసం అర్జీలు పెట్టుకున్నారు. 59 మంది అటెండర్లు తాము తిరిగి రెవెన్యూ శాఖలోకి వస్తామని దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. దరఖాస్తు చేసుకున్నవారిలో గణితం సబ్జెక్టుతో ఇంటర్, ఆపై విద్యార్హత ఉన్నవారిని సర్వేయర్ పోస్టునకు ఎంపిక చేస్తారని సమాచారం. వీరిలో టీఎస్‌పీఎస్సీ ద్వారా కాకుండా కారుణ్య నియామకాల ద్వారా వచ్చిన వారికి అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షల ఫలితాల అనంతరం గ్రామ స్థాయి అధికారులు రెవెన్యూ శాఖలో విధులు నిర్వహించనున్నారు. ఏదేమైనా గ్రామస్థాయి అధికారుల వ్యవస్థతో రెవెన్యూ శాఖలో ధ్రువీకరణపత్రాల జారీ, భూముల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సర్వీసును కొనసాగిస్తూ లెక్కించాలి..



గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన వారికి ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండా అర్హతల ఆధారంగా వీఎల్‌ఏ పోస్టుల్లో సర్దుబాటు చేయాలి. అలాగే మాతృశాఖ నుంచి ఇతర శాఖలోకి వెళ్లి తిరిగి వచ్చే వారి సర్వీసును అలాగే కొనసాగిస్తూ లెక్కించాలి. లేనట్లయితే పదోన్నతుల్లో నష్టపోయే అవకాశం ఉంటుంది.

- బెజ్జం భరత్, రికార్డ్ అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, గూడూరు

నేటి నుంచి శ్రీవేంకటేశ్వరస్వామి.. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- ముడుపుగల్‌లో రూ.2.50 కోట్లతో గుడి నిర్మాణం
- 3న శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్ర రామనుజ జీయర్‌స్వామి రాక
- గ్రామంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు



ముడుపుగల్‌లో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం

మహబూబాబాద్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామం ఆధ్యాత్మిక ఉత్సవాల నిర్వహణకు సిద్ధమైంది. గ్రామస్థుల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయమూర్తి ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమం ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు కొనసాగనుంది. ఐదు రోజులపాటు గ్రామంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ బాధ్యులు, మాజీ సర్పంచ్ యాస రమా వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ముడుపుగల్‌లో 2022లో 15 గుంటల విస్తీర్ణంలో వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించాలని గ్రామస్థులంతా నిర్ణయం తీసుకున్నారు. తలకొంత వేసుకుని నిధిని సమకూర్చుకుని పనులకు శ్రీకారం చుట్టారు. మూడేళ్ల పాటు నిర్మాణం కొనసాగి, ఇటీవల మొత్తం పూర్తయింది. నిర్మాణానికి మొత్తంగా రూ. 2.50 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వ, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు హాజరుకానున్నారు.

నేటి నుంచి షురూ..

ముడుపుగల్ గ్రామంలో గురువారం నుంచి ఫిబ్రవరి 3 వరకు శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహణ కమిటీ బాధ్యులు అంతా సిద్ధం చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు తొలిరోజు ఉదయం 7 గంటలకు యాగశాల ప్రవేశముతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజులు పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. చివరి రోజు 3నపరమహంస పరివ్రాజాక చార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్‌స్వామి మంత్రోచ్చరణల నడుమ శ్రీవేంకటేశ్వరస్వామి యంత్ర-మూర్తి ప్రతిష్ఠ ధ్వజ స్తంభ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నట్లు చెప్పారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఉత్సవ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

'కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి'

నెహ్రూసెంటర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధి నిర్మూలనకు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కుష్ఠువ్యాధి నివారణ ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్ అన్నా రు. మహబూబాబాద్‌లోని ఐఎంఏ హాల్లో సంబంధిత వైద్య సిబ్బందితో అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గర్భధారణ నేరం..

మహబూబాబాద్ జిల్లాలోని సమీకృత కుటుంబసంక్షేమశాఖ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు అర్మాన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గర్భధారణ, నిర్వహణ నియమాలపై బుధవారం పది ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో ఏఎన్ఎంల ఐఎంఏ హాల్లో శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మాతాశిశు మరణాలు తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వార క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలు తమ విధి నిర్వహణలోనైపుణ్యాలను పెంపొందించుకుని హైరిస్క్‌గా ఉన్న గర్భిణీలను గుర్తించి పలు సూచనలు, సలహాలు అందించడందోహదం చేస్తుందన్నారు. శ్రావణ్‌కుమార్, సౌజన్య, కొప్పు ప్రసాద్, రామకృష్ణ, కేవీ రాజు, పురుషోత్తం, అరుణ్‌కుమార్, సౌమిత్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, ఉమాకర్, అరుణ్ పాల్గొన్నారు.



తెలంగాణ టీచర్స్ యూనియన్-2025 డైరీని ఆవిష్కరిస్తున్న రవీందర్‌రెడ్డి

'టెన్త్'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి29 (ఆంధ్రజ్యోతి) : వచ్చే మార్చిలో జరుగబోయే పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో జిల్లా వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం తెలంగాణ టీచర్స్ యూనియన్-2025 నూతన డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సెస్సీ ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహిస్తూ సన్నద్ధం చేయాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10 జీపీఏ ఎక్కువ మంది విద్యార్థులు సాధించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొంపెల్లి బిక్షంగౌడ్, బొందిలి వెంకన్న, బీవీ ప్రసాద్, ఎం.శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ స్టడీ అవర్స్ విద్యార్థులకు నిధులు విడుదల

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల స్టడీ అవర్స్‌లో వారికి అల్పాహారం అందించేందుకు నిధులు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 3,827 మంది విద్యార్థులు పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కానుండగా, రూ. 21,81,390 విడుదలైనట్లు వివరించారు. స్టడీ అవర్స్‌లో 38 రోజుల పాటు ప్రతీ విద్యార్థికి రోజుకు రూ.15 చొప్పున అల్పాహారం అందించాలని పేర్కొన్నారు. వచ్చిన నిధులను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతీరోజు సాయంత్రం స్టడీ అవర్స్‌లో అల్పాహారం అందించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సాయిలు

రూ. 5 లక్షల కోట్లు కేటాయించాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బంధు సాయిలు

కాకతీయఖని, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం రూ. 5లక్షల కోట్లు కేటాయించాలని, వైద్య, విద్యా రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బంధు సాయిలు డిమాండ్ చేశారు. భూపాలపల్లిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలులో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులు పక్కనే ఉన్నా గ్రామాలకు చుక్కనీరు అందడం లేదని, కనీసం తాగునీటి వసతి లేదని అన్నారు. భూపాలపల్లి పట్టణం అనేక సమస్యలతో సతమతమవుతోందని అన్నారు. ఉపాధి హామీ పనులను పట్టణ వాసులకు కల్పించాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలు వస్తే రాష్ట్రాల్లో తీరని నష్టం జరుగుతుందని, ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు వెలిశెట్టి రాజయ్య, గుర్రం దేవేందర్, పోలెం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

జాక్టో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

గోవిందరావుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని జాక్టో, అధ్యాపక, ఆచార్య సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో శాసనమండలి సభ్యుడిగా పనిచేసిన కాలంలో ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 61 సంవత్సరాలకు పెంపు, మొదటి తెలంగాణ పీఆర్సీలో 30శాతం ఫిట్‌మెంట్ సాధన, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించడం కేజీబీవీ ఉపాధ్యాయినిలకు 180 రోజుల మెటర్నిటీ సెలవుల సౌకర్యం వంటివి సాధించి పెట్టానని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమిపాలైనప్పటికీ ఆరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ సమాజంలో ఉంటూ వారి పోరాటాలకు మద్దతుగా నిలిచానని అన్నారు. మార్చిలో జరుగబోయే ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఆట సదయ్య, జిల్లా అధ్యక్షుడు శిరుప సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, నాయకులు పోరిక శంకర్, బానోత్ విజయ్, కందిక రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం కలగకుండా ఏర్పాట్లు

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి
- మేడారంలో పర్యటన
- వనదేవతలకు మొక్కులు

తాడ్వాయి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మేడారం మినీ జాతరకు అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. మేడారంలో ఆయన బుధవారం పర్యటించారు. వనదేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గద్దెల పరిసరాలు, విద్యుత్ ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ జాతరకు విద్యుత్ సిబ్బంది అందరూ సన్నద్ధంగా ఉన్నారని అన్నారు. ఎలాంటి అంతరాయం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. మినీ జాతరలో విద్యుత్ సౌకర్యాల కోసం ప్రభుత్వం రూ.42 లక్షల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. తల్లుల గద్దెల వద్ద భక్తుల దర్శనాలకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్ ఉండేందుకు ఏర్పాటు చేసిందన్నారు. గ్రామ పరిసరాల్లో వీధి లైట్లు, నూతన దుకాణాలు, వసతి గదుల్లో విద్యుత్ సౌకర్యం కోసం 100 కేవీ డీటీఆర్‌లతో సరఫరా చేస్తున్నమన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి భక్తులకు మెరుగైన విద్యుత్ సౌకర్యాలను అందిస్తామని తెలిపారు. మిగిలి ఉన్న పనులను పూర్తి చేసి మినీ జాతరకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బికమ్‌సింగ్, ఎస్ఈ మల్హార్ నాయక్, డీఈ నాగేశ్వరావు, డీఈ ఎంఆర్‌టీ సదానందం, విద్యుత్ సిబ్బంది శ్రీనివాస్, శేషు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ అధికారులకు సూచనలిస్తున్న సీఎండీ వరుణ్ రెడ్డి

ముగిసిన పురపాలన

- మాజీలైన చైర్మన్, కౌన్సిలర్లు
- ప్రత్యేక అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్


మూలనపడ్డ చెత్త తరలింపు వాహనాలు

తొర్రూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పాలకవర్గ సభ్యుల కాల పరిమితి ఆదివారం ముగియడంతో వారు మాజీలయ్యారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రస్తుతం పంచాయతీ, మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో పాలన సాగుతుండగా, తాజాగా మునిసిపాలిటీ కూడా ఆ జాబితాలో చేరింది. మరో రెండు నెలల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారనే ప్రచారం కొనసాగుతుండడంతో మునిసిపాలిటీ ఎన్నికలకు ఎన్ని నెలలు పడుతుందో అని ఆశావహులు ఆలోచనలో పడ్డారు.

2020లో పాలకవర్గం ఏర్పాటు

తొర్రూరు మునిసిపల్ పాలకవర్గం 2020 జనవరిలో ఎన్నికలు జరగగా, అదే నెల 27న బాధ్యతలు స్వీకరించారు. మునిసిపల్ చైర్మన్‌గా మంగళపల్లి రాంచంద్రయ్య బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకు కరోనా విజృంభించడంతో మునిసిపాలిటీలో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. అప్పటి ప్రభుత్వం పట్టణ ప్రగతి పేరు తో కొత్త కార్యక్రమాన్ని తీసుకువచ్చి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తామని ప్రకటించింది. ఈ నిధుల ద్వారా మునిసిపాలిటీ పరిధిలో వివిధ పనులను కాంట్రాక్టర్‌లకు అప్పగించారు. దీంతో పాలకవర్గాలు ఎలాంటి పనులు చేయడానికి వీలులేకుండా పోయింది. వీధి దీపాలు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, వైకుంఠ దామాలు, పట్టణ ప్రకృతి వనాలు వంటి పనులు చేపట్టడంతో నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. జూన్ 2023 నుంచి పట్టణ ప్రగతి నిధులు పూర్తిగా నిలిచిపోవడంతో మాజీ మంత్రి దయాకర్ రావు సహకారంతో నిధులు విడుదల చేయడంతో మరికొన్ని పనులు పూర్తి చేశారు. తొర్రూరు మునిసిపాలిటీ ప్రత్యేకాధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోను నియమిస్తున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

పెండింగ్ పనులు పూర్తయ్యేనా ?

గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పట్టణంలో కొంతమేర అభివృద్ధి జరిగింది. చిల్డ్రన్స్ పార్కు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మైనార్టీ హాస్టల్, భగీరథ కార్యాలయం, సెంట్రల్ లైటింగ్, తాగునీటి ట్యాంక్‌లు లాంటి పనులు పూర్తయ్యాయి. ప్రధానంగా మోడల్ మార్కెట్ పూర్తిస్థాయి నిర్మాణం, కోల్డ్ స్టోరేజి ఏర్పాటు, మనగ్రోమోర్ నుంచి పాలకేంద్రం వరకు సెంట్రల్ లైటింగ్, పెద్దచెరువు పైన మినీ ట్యాంక్ బండ్, ఎల్‌వైఆర్ గార్డెన్ రోడ్డు వెడల్పు, గోపాలగిరిలో పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ, ఆకేరు వాగుపై బ్రిడ్జిలు, ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు, ఇండోర్ స్టేడియం, మునిసిపాలిటీ నూతన భవనం, ప్రధానంగా డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉంది. చెత్త తరలింపును తండా వాసులు అడ్డుకోవడంతో కొంతకాలం పట్టణ శివారు, రోడ్ల వెంట చెత్తవేశారు. కొద్దిరోజులుగా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పూర్తిస్థాయిలో వాహనాలు లేకపోవడం, సిబ్బంది కొరత, డంపింగ్ యార్డు నిర్మాణం పూర్తి చేయకపోవడం లాంటి సమస్యలున్నాయి. నాలాల సమస్యలు తీవ్రంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతాయని పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వీటికి నిధులు కొంతమేర మంజూరయ్యాయని అధికారులు చెప్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. పాలకవర్గ పదవీకాలం ముగిసింది. అభివృద్ధి పనుల మాటేమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మంజూరైన నిధులు వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు.


మెయిన్ రోడ్డుపై అసంపూర్తిగా ఉన్న నాలా నిర్మాణం

ఎఫ్ఏపై చర్యలు తీసుకోవాలి

ఎల్లంపేట ఉపాధి కూలీల డిమాండ్


ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీవోకు ఫిర్యాదు చేస్తున్న ఎల్లంపేట గ్రామస్థులు

మరిపెడ/మరిపెడ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఎల్లంపేట ఉపాధి కూలీలు గండి బుచ్చిబాబు, చంద కొండల్‌రావు, వి.మనోజ్, ఈర్ల వెంకన్న, జి.అంజి డిమాండ్ చేశారు. బుధవారం ఎల్లంపేటలో వారు మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఐనాల మైసయ్య లక్ష్మాతండాలోనే ఉపాధి హామీ పథకంలో కొన్నిగ్రూపుల వారు పని చేయకుండానే, వారికి హాజరు వేసి, బిల్లులు చేసి కూలీలు సగం, ఫీల్డ్ అసిస్టెంట్‌కు సగం చొప్పున పంచుకున్నారని ఆరోపించారు. అలాగే ఎల్లంపేటలో కొత్తజాబ్ కార్డులు ఇప్పిస్తాననిడబ్బులు కూడా తీసుకున్నారన్నారు. దసరా పర్వదినం రోజున కూడా పనిదినాలు వేసి, మస్టర్లు రాసి, హాజరు వేసి పైసలు తీసుకున్నారని ఆరోపించారు. ఇదంతా సామాజిక తనిఖీలో వెల్లడైందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని మరిపెడ మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో మంగమ్మకు ఫిర్యాదు చేశారు.

ఆడపిల్ల అమ్మకంపై వదంతులు


మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తల్లిదండ్రుల వద్ద శిశువు

- అప్రమత్తమైన జిల్లా ఆస్పత్రి అధికారులు
- తల్లిదండ్రుల వద్ద శిశువు క్షేమం

నెహ్రూసెంటర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నవజాత శిశువు తల్లిదండ్రుల వద్ద క్షేమంగా ఉందని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ బత్తుల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పాకాల కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన రాళ్లబండి కావ్య-రవి దంపతులకు రెండో సంతానంగా ఆడపిల్ల జన్మించినట్లు చెప్పారు. ఈ నెల 27న ఆస్పత్రిలో అడ్మిట్ కాగా, 28న వైద్యులు శస్త్రచికిత్స చేయగా, ఆడశిశువు జన్మించింది. కావ్యకు తొలికాన్పు లో ఆడపిల్లనే పుట్టగా, రెండో కాన్పులోనూ ఆడశిశుకు జన్మించింది. దీంతో ఈనెల 29న కుటుంబ పోషణ భారమవుతుందని రెండో బిడ్డను ఎవరికైనా దత్తత ఇద్దామని భార్యాభర్తలిద్దరు చర్చించుకున్నారు. ఆ మాటలను విన్న ఆస్పత్రిలోని ఓ ఆకతాయి సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ఈ విషయంపై ఆస్పత్రి అధికారులు అప్రమత్తమై శిశువు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. దీంతో తామే తమ పాపను పోషించుకుంటామని అధికారులకు తెలిపారు. ఈ విషయంపై అస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా, తల్లిదండ్రుల వద్దనే నవజాత శిశువు క్షేమంగా ఉందని, ప్రస్తుతం ఆస్పత్రిలోనే పోస్ట్ ఆఫ్ వార్డులో ఉన్నారని పేర్కొన్నారు.

ఏజెన్సీలో అటకెక్కిన చదువులు

- మూతపడిన ప్రాథమిక పాఠశాలలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

గంగారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో పిల్లలు చదువులకు దూరం అవుతున్నారు. ఉపాధ్యాయుల్లో కొరవడిన అంకితభావం, మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి గంగారం మండలం దుబ్బగూడెంలో రెండు పాఠశాలలు మూతపడ్డాయి. మండల కేంద్రానికి ముప్పై కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవుల నడుమ నున్న దుబ్బగూడెం పంచాయతీకి మూడు పాఠశాలలు ఉంటే, రెండు స్కూళ్లు పంతుళ్లు రాక నడువడం లేదు. తాళ్లగుంపు ప్రాథమిక పాఠశాలకు చిన్నారులు ఉన్నా ఉపాధ్యాయులు ఇద్దరూ బదిలీకావటంతో అక్కడ చదువుకునే చిన్నారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

గతంలో మామిడిగూడెం ప్రాథమిక పాఠశాల 'మన ఊరు-మన బడి' పథకం క్రింద ఎంపికైనా ఇక్కడ టీచర్లు సక్రమంగా రాకపోవటంతో తల్లి తండ్రులు వారి పిల్లలను పక్క మండలం లింగాల పాఠశాలకు పంపుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై గంగారం విద్యాశాఖ అధికారి రమాదేవిని వివరణ కోరగా.. దుబ్బగూడెం పంచాయతీలో చిన్నారులు లేక మామిడిగూడెం ప్రాథమిక పాఠశాల, దుబ్బగూడెం గిరిజన పాఠశాలలు మూత పడినమాట వాస్తవమేనన్నారు. తాళ్లగుంపులో ఇద్దరు టీచర్లు బదిలీ కావటంతో అక్కడికి కోమట్లగూడెం నుంచి ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ వేశామన్నారు.




గంగారం మండలం దుబ్బగూడెం, మామిడిగూడెంలో మూతపడిన ప్రాథమిక పాఠశాలలు

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు


గాయపడిన సేతుపతి

వెంకటాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణ పని కోసం వచ్చి విద్యుదాఘాతానికి గురైన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని వీరభద్రవరంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గోర్ల గ్రామానికి చెందిన సేతుపతి వీరభద్రవరం గ్రామానికి ఇంటి నిర్మాణ పని కోసం వచ్చాడు. ఈక్రమంలో నిర్మాణ పనులు చేస్తుండగా ఇంటిపైనున్న విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురయ్యాడు. దీంతో వీపుభాగం సగానికిపైగా కాలిపోయింది. గ్రామస్థులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు.

ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చర్యలు

తొర్రూరు కమిషనర్ శాంతి కుమార్


ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకుంటున్న మునిసిపల్ సిబ్బంది

తొర్రూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు చేపడితే చర్యలుంటాయని తొర్రూరు మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ అన్నారు. బుధవారం మునిసిపల్ సిబ్బంది పట్టణంలోని వివిధ వ్యాపార సముదాయాలను తనిఖీ చేసి, ప్లాస్టిక్ విక్రయాలు చేపడుతున్న వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ ఏరియా, ఎల్‌వైఆర్ రోడ్డు, మెయిన్ రోడ్డులపై మార్వాడీలు అత్యధికంగా ప్లాస్టిక్ విక్రయాలు చేస్తున్నారని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెండు మార్వాడీ షాపులకు రూ.15 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ విక్రయాలు 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం గల కవర్లు, బ్యాగ్‌లు వాడినా, నిల్వచేసినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వారి వ్యాపార లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవేందర్, వార్డు అధికారులు కిరణ్, వెంకన్న, ముస్తఫా తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత


రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోలీసులు

మరిపెడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యతని తొర్రూరు డీఎస్పీ కె.కృష్ణకిశోర్ అన్నారు. బుధవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని కార్గిల్ సెంటర్లో స్థానిక పోలీసులు చేపట్టిన హెల్మెట్ వాహన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు హెల్మెంట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. ట్రిబుల్ రైడ్‌తో ప్రమాదాలు తెచ్చుకోవొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. పోలీస్ బైక్‌ర్యాలీ కార్గిల్ సెంటర్ నుంచి రాజీవ్‌గాంధీ సెంటర్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో మరిపెడ సీఐ రాజ్‌కుమార్ గౌడ్, ఎస్సైలు బోలగాని సతీశ్, సంతోశ్, సీరోల్ ఎస్సై నగేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతరకు రావాలని ఆహ్వానం


ఏఎస్పీకి ఆహ్వాన పత్రిక ఇస్తున్న పూజారి వెంకటేశ్వర్లు


ఏటూరునాగారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కొండాయి జాతరకు రావాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఎస్సై తాజుద్దీన్, ఐటీడీఏ డీడీ పోచంను మేడారం సారలమ్మ ప్రధాన పూజారి, ఆ గ్రామ మాజీ సర్పంచ్ కాక వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం సాయంత్రం ఏఎస్పీ, ఐటీడీఏ డీడీ, ఎస్సైను వారు కలిశారు. ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు మండలం పరిధిలోని కొండాయి గ్రామంలో జరగనున్న గోవిందరాజు, నాగులమ్మ, సారలమ్మ జాతరకు రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. జాతరను పురస్కరించుకొని ములుగు జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నీ కూడా నిర్వహించనున్నామని, ముఖ్య అతిథులుగా హాజరు కావాలని ఈ సందర్భంగా కొండాయి యూత్ సభ్యులు కోరారు.

అంతుచిక్కని వ్యాధితో నాటు కోళ్లు మృతి

ఇనుగుర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వర్ధోలు మహేందర్, వెంకన్నకు చెందిన 25 నాటు కోళ్లు అంతుచిక్కని వ్యాధితో మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. మంగళవారం నాలుగు కోళ్లు మృతి చెందగా 21 కోళ్లు బుధవారం చనిపోయాయి. వాటి విలువ రూ.9వేలు ఉంటుందని బాధితులు తెలిపారు.

ఇటు అత్త, అటు తండ్రి మృతి

ఒకేరోజు ఇద్దరిని కోల్పోయి తల్లడిల్లిన వనపూల


బాలయ్య (ఫైల్)


ఉప్పలమ్మ (ఫైల్)

కొత్తగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఒకేరోజు అత్త, తండ్రి మృతి చెందడంతో ఆ మహిళ తల్లడిల్లిపోయింది. కొత్తగూడ మండలంలోని ఎంచగూడెంకు చెందిన మీరాల వనపూల అత్త ఉప్పలమ్మ (60) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా, 24 గంటలు గడవకముందే ఆ మరుసటి రోజు బుధవారం ఉదయం కోనాపురానికి చెందిన వనపూల తండ్రి గాడుదుల బాలయ్య (65) అనారోగ్యంతో మృతి చెందాడు. అత్త మృతి చెందిన బాధలోంచి తేరుకోకముందే కన్న తండ్రి చనిపోవడంతో వనపూల రోదనలు మిన్నంటాయి.

మోగిన టీచర్ ఎమ్మెల్సీ నగారా



ఫిబ్రవరి 3న నోటిఫికేషన్.. 27న పోలింగ్.. మార్చి 3న లెక్కింపు

- వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక
- బీజేపీతో పాటు అభ్యర్థులను ప్రకటించిన ఉపాధ్యాయ సంఘాలు
- పోటీనా ? మద్దతా ? తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు
- ఎన్నికల కోడ్‌తో మూడు ఉమ్మడి జిల్లాల్లో అభివృద్ధి పనులకు బ్రేక్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికకు నగారా మోగింది. ఈ మేరకు బుధవారం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం మార్చి 29వ తేదీతో పూర్తి కానుంది. ఈలోగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. మరోవైపు ఉపాధ్యాయ సంఘాలతో పాటు రాజకీయ పార్టీలు కూడా టీచర్ ఎమ్మెల్సీ స్థానంపై దృష్టి సారించాయి. ఇప్పటికే బీజేపీ.. తన అభ్యర్థిని ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని బరిలో దించటమా? లేక ఏదైనా ఉపాధ్యాయ సంఘం అభ్యర్థికి మద్దతు ఇవ్వాలా? అనే ఆలోచనలో ఉంది. ఇక బీఆర్ఎస్ మాత్రం పోటీకి సుముఖంగా లేనట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే పీఆర్‌టీయూ, టీజీయూటీఎఫ్ సంఘాలు మాత్రం ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుండటంతోపాటు ఉపాధ్యాయ సంఘాల్లో కీలక నేతలు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగేం దుకు ఏర్పాట్లు చేసుకుంటుండటంతో ఎమ్మెల్సీ ఎన్నిక ఉత్కంఠగా మారా యి. ఎన్నికల కోడ్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది.

ఫిబ్రవరి 27న ఎమ్మెల్సీ ఎన్నిక

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 10వ తేదీ నామినేషన్లకు చివరి రోజుగా పేర్కొన్నారు. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణలకు అవకాశం ఇచ్చారు. ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం 8గంటల నుంచి సాయంత్ర 4గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి, 8వ తేదీన మొత్తం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. గత అక్టోబరు, డిసెంబరు నెలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. జనవరి మొదటి వారంలో తుది ఓటరు జాబితాను ప్రకటించింది. ఉపాధ్యాయ నియోజకవర్గంలో మొత్తం 24,905 మంది ఓటర్లుగా తమ పేరును నమోదు చేసుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 10,960మంది ఓటర్లు ఉండగా, 76 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 8,041 మంది ఓటర్లు ఉండగా, 77 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 5,904 మంది ఓటర్లు ఉండగా, 47 పోలింగ్ కేం ద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 24,905 మందిలో 14,940 మంది పురుషులు, 9,965 మంది మహిళ ఓటర్లు ఉన్నారు. 2019 మార్చిలో జరిగిన ఎమ్మె ల్సీ ఎన్నికల్లో 20, 888 మంది ఓటర్లు మాత్రమే ఉండగా, ఈసారి అదనంగా 4,0 17మంది ఓటర్లు నమోదయ్యారు. మొత్తంగా 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి బూత్ లెవల్ అధికారులు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పోటీకి బీఆర్ఎస్ దూరమే ?

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరం ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఆ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పార్టీ నేతలతో చర్చలు కూడా జరపటం లేదు. దీంతో పార్టీ నుంచి పోటీ చేయాలనే ఆలోచన ఉన్న నేతలు సైతం ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ సైతం పార్టీ నుంచి పోటీ చేసే అవకాశాలు లేకపోవటం వల్ల ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా బీఆర్ఎస్ నేరుగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దిగలేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. 2019లో మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌కు బీఆర్ఎస్ బయట నుంచి మద్దతు ఇచ్చింది. ఆఎన్నికల్లో పూల రవీందర్‌పై టీజీయూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి విజయం సాధించారు. ప్రస్తుతం కూడా పోటీలోకి దిగకుండా ఎవరికైనా మద్దతు ఇవ్వొచ్చని గులాబీ పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

సమరానికి సై

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జరిగే ఎన్నికల్లో తేల్చుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు సిద్ధమవుతున్నాయి. తెలంగాణలో సుమారు 55కు పైగా ఉపాధ్యాయ సంఘాలు ఉన్నప్పటికీ ప్రధానంగా టీజీయూటీఎఫ్, పీఆర్‌టీయూ, తపస్ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి బరిలో దించుతున్నట్లుగా టీజీయూటీఎఫ్ ప్రకటించింది. అలాగే పీఆర్‌టీయూ నుంచి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి బరిలో దిగుతున్నారు. తపస్ మద్దతుతో బీజేపీ నుంచి మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డి పోటీకి దిగుతున్నారు. టీచర్స్ జాక్ పేరుతో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, సీపీఎస్ సంఘం నుంచి ఎం.వెంకటస్వామి పోటీకి సై అంటున్నారు. వీరితో పాటు మాజీ కూడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సమరానికి సై అంటు న్నారు. మరోవైపు బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటం చర్చనీయాంశంగా మారింది.

మాజీ పీఆర్‌టీయూ నేత సరోత్తంరెడ్డిని తమ అభ్యర్థిగా బరిలో దించటంతో ఉపాధ్యాయుల ఎన్నికల్లో వార్ మొదలైంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికపై ఆచీతూచి వ్యవహరిస్తోంది. పార్టీ నుంచి అభ్యర్థిని బరిలోకి దించటమా? లేక ఏదైనా ఉపాధ్యాయ సంఘం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థికి లేదా స్వతంత్రంగా పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఎవరికైనా మద్దతు ఇవ్వడమా? అనే అంశంపై చర్చలు జరుపుతోంది. గతంలో మాదిరిగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉంటూ, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీపై ఫోకస్ చేయాలని కాంగ్రెస్‌లోని ఓ వర్గం నేతలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీంతో కాంగ్రెస్ ఏ నిర్ణయం తీసుకుంటుందో అనే ఉత్కంఠ ఉపాధ్యాయ సంఘాల్లో నెలకొంది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
వరంగల్	13	2,225
హనుమకొండ	15	5,098
మహబూబాబాద్	16	1,618
జనగామ	12	921
భూపాలపల్లి	07	323
ములుగు	09	612
సిద్దిపేట (పూర్వ వరంగల్)	04	163
మొత్తం	76	10,960

కోడ్ ఎఫెక్ట్

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించటంతో వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఈ మూడు జిల్లాల్లో ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా బ్రేక్ పడింది. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం జరుగుతుండగానే ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో ఆర్ధాంతరంగా సమావేశాన్ని ముగించారు.

అలాగే పరకాల నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలకు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి షెడ్యూల్ ఖరారైనప్పటికీ, ఎన్నికల కోడ్‌తో అన్ని రద్దు చేసుకున్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా తమ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలను నిలిపివేశారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. బ్యాలెట్ పత్రాల లెక్కింపు కావటంతో ఫలితం వచ్చే వరకు రెండు మూడు రోజులు పట్టే అవకాశం ఉంది. మొత్తంగా మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది. అప్పటి వరకు ప్రభుత్వం పరంగా వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాలతో పాటు టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలో కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది.

అమెరికాలో ఉన్న వారికి ఇక్కడ ఎఫ్ఏసీ ఎంఈవో ?

చర్చనీయాంశంగా మారిన డీఈవో, ఆర్జేడీ చర్యలు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండల విద్యాశాఖాధికారి అకాల మరణంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేసే ప్రక్రియలో డీఈవో వాసంతి చర్యలు సక్రమంగా లేవంటూ ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ కొనసాగుతోంది. సెలవుపై వెళ్లి అమెరికాలో ఉన్న హెడ్మాస్టర్‌కు హసన్‌పర్తి ఎఫ్ఏసీ ఎంఈవోగా బాధ్యతలు కట్టబెట్టేందుకు డీఈవో వాసంతి, ఆర్జేడీ కె.సత్యనారాయణరెడ్డి ఆగమేఘాల మీద చేపడుతున్న చర్యలు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ నెల 24న హసన్‌పర్తి ఎంఈవో ఇ.రవీందర్ అకాల మృతి చెందారు. ఈ స్థానంలో అమెరికాలో ఉన్న హెడ్మాస్టర్ జి.రాజిరెడ్డికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించేందుకు వేగంగా చర్యలు చేపట్టడం పట్ల ఉపాధ్యాయ వర్గాలు తప్పుబడుతున్నారు. ఎవరైనా ఎంఈవో అకాల మృతి చెందితే అక్కడున్న సీనియర్ హెడ్మాస్టర్‌కు ఎఫ్ఏసీ బాధ్యలు అప్పగించడం అనేది నిబంధన. ఎవరు సానుకూలంగా లేకుంటే పక్క మండలంలోని ఎంఈవోకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించాలి. అయితే ఇదంతా పక్కన బెట్టి ఫిబ్రవరి మూడో తేదీ విధుల్లో చేరుతానని అమెరికా నుంచి ఒక అండర్ టేకింగ్ లెటర్ ఇచ్చిన రాజిరెడ్డికే ఎఫ్ఏసీ ఎంఈవో బాధ్యలు అప్పగించే చర్యలు చేపట్టడాన్ని తప్పుబడుతున్నారు. ఇటీవలే జరిగిన ఎఫ్ఏసీ ఎంఈవోల నియమాకాల్లో ఇదే జిల్లాలోని వేలేరు మండలం నోడల్ ఆఫీసర్‌గా ఉన్న మల్లికుదురు జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ జయసాగర్ ఆ సమయంలో విదేశాల్లో ఉండటం వల్ల అదే మండలంలోని ఎర్రబెల్లి జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ చంద్రమౌళికి ఎఫ్ఏసీ ఎంఈవో బాధ్యతలను అప్పగించారు. అయితే హసన్‌పర్తి ఎఫ్ఏసీ ఎంఈవో విషయంలో మాత్రం పది రోజుల తర్వాత విదేశం నుంచి స్వదేశానికి వచ్చే హెడ్మాస్టర్‌కు ఎఫ్ఏసీ కట్టబెట్టేందుకు డీఈవో చూపిస్తున్న ఉత్సాహాన్ని ఉపాధ్యాయ వర్గాలు విమర్శిస్తున్నాయి. కాగా, విదేశాల్లో ఉన్న రాజిరెడ్డికే బాధ్యతలు కట్టబెట్టాలని హనుమకొండ జిల్లా హెడ్మాస్టర్ల అసోసియేషన్ వినతి పత్రం ఇవ్వడాన్ని సైతం ఉపాధ్యాయులు తప్పుబడుతున్నారు. విదేశాల నుంచి ఇక్కడకు వచ్చి విధుల్లో చేరిన తర్వాతనే డీఎస్సీకి ఫైల్ పంపించాల్సిన ఆర్జేడీ సైతం డీఈవో చర్యలకు వంతపాడటాన్ని ఉపాధ్యాయ వర్గాలు వ్యతిరేకిస్తున్నారు.

లబ్ధిదారులకు అభయ హస్తం

- పథకం డబ్బులు ఇప్పించేందుకు సర్కారు ఆలోచన
- వడ్డీతో డబ్బులు కలిపి చెల్లించే యోచన
- ఈ నెలాఖరులోగా ఖాతాలో జమకు అవకాశం
- 1.92 లక్షల మందికి రావాల్సిన మొత్తం రూ.79.50 కోట్లు

అభయహస్తం
స్వయం సహాయక బృందాల భాగస్వామ్య పెంచను పథకం

హనుమకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అభయ హస్తం పథకం డబ్బుల ను తిరిగి ఇచ్చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ డబ్బును వడ్డీతో కలిపి నెలాఖరులోగా మహిళల ఖాతాల్లో జమ చేయాలని యోచి స్తోంది. ఈ మేరకు అభయ హస్తం లబ్ధిదారుల వివరాలను సేకరించను న్నారు. గతంలోనే ఉమ్మడి జిల్లాలోని అధికారులు వివరాలను సేకరించి ప్రభు త్వానికి అందచేశారు. అయితే ఈ సారి గ్రామాలవారీగా జాబితాలను రూపొందించనున్నారు. ఇందులో భాగంగా జీవించి ఉన్న, మరణించిన వారి వివరాలను సేకరిస్తారు. లబ్ధిదారులు మరణిస్తే వారి వారి వారసుల సమా చారాన్ని సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే అధికారులు ప్రభు త్వం నుంచి మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నారు.

రూ.79.50 కోట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలు హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలతో పాటు వరంగల్ మహానగర పాలక సంస్థ, అప్పటి మూడు పురపాలక సంఘాలు జనగామ, నర్సంపేట, మహబూబాబాద్ పరిధిలోని 1,92,823 మంది స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు అభయ హస్తంలో చేరారు. 2013వరకు వార్షిక ప్రీమియంగా డబ్బులు చెల్లిస్తూ వచ్చారు. ఐదేళ్లు చెల్లించిన మొత్తం రూ.79.50 కోట్లు అయింది. అప్పటి నుంచి వడ్డీకూడా లెక్కిస్తే రెండింతలు అవుతోంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం అభయ హస్తం బీమా పథకాన్ని రద్దు చేసి ప్రీమియం వసూళ్లను నిలిపివేసింది. మార్పులు, చేర్పులతో మరింత మెరుగైన రీతిలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని మళ్లీ అమలు చేస్తుందని మహిళలు భావించారు. కానీ పథకాన్ని కొనసాగించకపోగా కట్టిన ప్రీమియం సొమ్ములు కూడా వెనక్కి ఇవ్వలేదు. అభయ హస్తం పథకం లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడాన్ని గమనించిన ప్రభుత్వం.. ప్రీమియం సొమ్ము తిరిగి చెల్లిస్తామని ప్రకటించింది. గత ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లోని సెర్ప్ సిబ్బంది మహిళల బ్యాంకు ఖాతాలు, ఇతర వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదించారు. వారం, పది రోజుల్లో ప్రభుత్వం వడ్డీతో సహా ప్రీమియం డబ్బులు ఖాతాల్లో జమ చేస్తుందని భరోసా ఇచ్చారు. అయినా డబ్బులు ఖాతాల్లో జమకాక మహిళలు నిరాశకులోనయ్యారు. ఒక దశలో ఈ డబ్బులపై ఆశలు వదులుకున్నారు.

నీరుగారిన లక్ష్యం

అభయ హస్తం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రవేశపెట్టింది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన ఒక మంచి పథకం ఇది. దీనిని కొనసాగించడంతో పాటు అవసరమనుకుంటే కొన్ని సవరణలు చేసి మరింత మెరుగ్గా అమలు చేయాల్సి ఉంది. స్వయం సహాయక సంఘాల మహిళలకు మరింత ఆర్థిక భద్రత, ప్రయోజనాలను కల్పించాలనుకుంటే ఈ పథకం ద్వారా చెల్లించే పింఛన్‌ను, పరిహారాలను పెంచితే బాగుండేది. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదేమీ చేయకుండా కేవలం కాంగ్రెస్ హయాం లో అమలులోకి వచ్చిందన్న ఒకే ఒక కారణంతో దీనిని అర్థాంతరంగా రద్దు చేసిందన్న విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ కింద నెలకు రూ.2016 చెల్లిస్తున్నందువల్ల అభయ హస్తం అవసరం లేదని ప్రభుత్వం భావించినట్టు తెలిసింది. దీనికితోడు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధాన మంత్రి జీవన్ బీమా యోజన (పీఎంజేబీవై), ప్రధాన మంత్రి సురక్ష యోజన (పీఎంఎస్‌కేవై) పథకాలు అభయ హస్తం తరహాలోనే ఉన్నాయి. కనుక అభయ హస్తం కొనసాగించాల్సిన అవసరం లేదని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని రద్దు చేసినప్పుడు దీని కింద తమకు రావలసిన డబ్బులను తిరిగి చెల్లించాలని ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లు చాలాకాలంగా డిమాండ్ చేశాయి. వారి డిమాండ్ అంగీకరించిన గత ప్రభుత్వం సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్)లో ఉన్న డిపాజిట్ సొమ్మును పంపిణీ చేయడానికి నిర్ణయించింది. కానీ ఆ తర్వాత చేతులెత్తేసింది. గతంలో ఈ అంశం అసెంబ్లీలో కూడా చర్చకు వచ్చింది. రెండు మూడు రోజుల్లో మహిళా వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలోకి మాత్రం రాలేదు.

15 ఏళ్ల కిందట..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉండగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2009లో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల కోసం ఎల్ఐసీ అనుసంధానంతో అభయ హస్తం పేరిట బీమా పాలసీని ప్రవేశపెట్టింది. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్లలోపు వయస్సు కలిగిన మహిళలు అభయ హస్తం బీమా పథకంలో చేరే అవకాశం కల్పించారు. పాలసీ తీసుకున్న సభ్యులు ఏడాదికి రూ.365 చొప్పున ప్రీమియం చెల్లించారు. ఇలా 59 ఏళ్ల నిండే వరకు వాయిదాలు చెల్లించాల్సి ఉంది. దీంతో వారి పిల్లలు చదువుతుంటే ఉపకార వేతనం మంజూరు చేసేలా, 60 ఏళ్ల నుంచి చివరి మజిలీ వరకు నెలకు రూ.500 చొప్పున పింఛను చెల్లించేలా, చనిపోతే రూ. 30వేలు, ఆర్థిక సాయం నామినీకి అందజేసేలా ఈ పథకంలో అవకాశం కల్పించారు.

అభయ హస్తం పథకాన్ని మొత్తానికి ఎత్తివేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఈ పథకం కింద నమోదైన ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులకు ఆసరా పథకం వర్తింప చేయాలనే నిశ్చయించింది. 2009లో అభయహస్తం పథకం ప్రారంభమైనప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1.92లక్షల మంది సభ్యులుగా ఉండగా వీరిలో 50శాతం మందికి ఆసరా పెన్షన్ రావడం లేదని గుర్తించారు. ఈ మేరకు అభయ హస్తం పథకం వివరాలను క్షేత్ర స్థాయిలో సేకరించాలని అధికారులను ఆదేశించింది.

రెంటికి చెడి..

అభయ హస్తంలోని సభ్యుల్లో ఆసరా పెన్షన్ అందనివారిని గుర్తించి అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చింది. ఈమేరకు అప్పట్లో ప్రకటనలు కూడా వెలువడ్డాయి. కానీ ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ కాలేదు. పెన్షనూ ఇవ్వలేదు. అభయ హస్తం ఎత్తివేయడం వల్ల చాలామంది మహిళలకు ఈ పథకం కింద పెన్షన్ రాకుండాపోయింది. అటు ఆసరా పెన్షనూ రావడం లేదు. దీనితో వీరి పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిగా మారింది. వారు ప్రీమియంగా చెల్లించిన సొమ్ము మాత్రం సెర్ప్ వద్ద ఇన్నాళ్లు మూలుగుతూ వచ్చింది. అభయ హస్తం కాంగ్రెస్ హయాంలోనే అమలులోకి వచ్చింది కనుక ఈ పథకం కింద మహిళలు ప్రీమియంగా చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో కలిసి తిరిగి ఇచ్చివేయాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. 15 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు తమ డబ్బులు తిరిగి వస్తున్నందుకు మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎట్టకేలకు ఏర్పాటైన పాలకవర్గం

- ఏనుమాముల మార్కెట్‌కు కమిటీ నియామకం
- చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్

వరంగల్ వ్యవసాయం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌కు ఎట్టకేలకు పాలకవర్గం ఏర్పాటైంది. ఆసియాలోనే రెండో అతిపెద్దదిగా చెప్పుకునే మార్కెట్‌కు 18 నెలలుగా పాలకవర్గం లేదు. దీంతో సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరిగిందనే విమర్శలున్నాయి. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ అనేక మార్లు ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలను ప్రచురించింది. దీంతో ప్రభుత్వం స్పందించి మంగళవారం అర్ధరాత్రి పాలకవర్గాన్ని నియమిస్తూ జీవో విడుదల చేసింది. వారం రోజుల్లో వారు బాధ్యతలు చేపట్టేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతో పెద్దఎత్తున ఈ కార్యక్రమం నిర్వహించేందుకు నూతన కమిటీ సమాయత్తమవుతోంది.

చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్మన్‌గా బండి జనార్దన్

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా విద్యావంతురాలు ఎర్ర ప్రియాంక, వ్యాపారవర్గాల నుంచి వైస్‌చైర్మన్‌గా బండి జనార్దన్‌తో పాటు కమిటీ సభ్యులుగా గాదరబోయిన రాజు, ధనికుల రాంబాబు, చల్లా వాసుదేవరెడ్డి, గొడుగు భిక్షపతి, భదవత్ నర్సింహనాయక్, ఆకుల రుద్రప్రసాద్, బొడ్డు ప్రదీప్‌కుమార్, కత్తి సంపత్, మహ్మద్ సబేరా, అచ్చ నాగరాజు, దుగ్యాల గోపాలరావు, గజ్జెల శ్యామ్ సుందర్‌లతో పాటు జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్, ఖిలా వరంగల్ పీఏసీఎస్ చైర్మన్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వరంగల్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌లతో కూడిన పాలకవర్గాన్ని నియమించారు.

మహిళలే మహారాణులు

తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ, మార్కెట్ కమిటీలలో మహిళలే కీలక పదవిలో ఉంటున్నారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం చైర్‌పర్సన్‌గా నూతనంగా ఎంపికైన ఎర్ర ప్రియాంకతో పాటు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పోలెపాక నిర్మల, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్‌గా సురేఖ, వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్‌గా పద్మావతి, మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి కూడా మహిలలే. అంతేగాకుండా వరంగల్ కలెక్టర్ సత్యశారద, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయశాఖాధికారి అనురాధ ఇలా అందరూ మహిళలే కావడం యాదృచ్ఛికమే అయినప్పటికీ మహిళలే మహరాణులు అన్నట్లు ఆదేశాలు జారీ చేసే స్థాయిలో ఉన్నారు.

మార్కెట్‌కు మంచి పేరు తెచ్చేలా చేస్తా

ఏనుమాముల మార్కెట్ చైర్ పర్సన్‌గా నాకంటూ ఓ గుర్తింపు దక్కేలా పని చేస్తా. మార్కెట్ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా. వ్యాపారుల సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గం సహకారం తీసుకుంటా. అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తా.

ప్రియాంక, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్

పాలనపై అనుమానాలెన్నో..

రాష్ట్రంలోనే అతి పెద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ కావడంతో నిత్యం అనేక సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. గతంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా చేసిన వారు అనేక ఇబ్బందులు పడ్డారు. సమస్యలను పరిష్కరించలేక, వేదికలపై మాట్లాడలేక, అధికారులతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయలేక, సమస్యలపై అవగాహన లేక చాల ఇబ్బందులు పడ్డ విషయం అదరికీ తెలిసిందే. ఈ నేపథ్యలో ప్రియాంక పాలనపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి కోడ్ అడ్డు?



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నేపథ్యం

మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా నియమితులైన ఎర్ర ప్రియాంక కాజీపేట ప్రాంతానికి చెందిన వారు. తల్లి స్వర్ణకిరీటి గృహిణి (చనిపోయారు). తండ్రి సుందర్ రైల్వే ఉద్యోగి. ప్రియాంక ఎస్ఆర్ యూనివర్సిటీలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ చేశారు. గోపాలపూర్‌కు చెందిన పులి అనిల్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం గోపాలపూర్‌లో నివాసం ఉంటున్నారు. భర్త అనిల్ వైద్యుడు. అంతేగాకుండా పదేళ్లుగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) నేషనల్ కో ఆర్డినేటర్‌గా, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీకి అఫీషియల్ అనువాదకుడిగా ఉన్నారు. విద్యార్థి దశలోనే నాయకుడిగా ఎదిగారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏనుమాముల మార్కెట్ కమిటీ ఎస్సీకి రిజర్వుడ్ కావడంతో తన భార్య ప్రియాంకకు అవకాశాన్ని కల్పించుకున్నారు.

ఏనుమాముల (వరంగల్) వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ మంగళవారం రాత్రి వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎట్టకేలకు 18 నెలల తరువాత పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు రైతులు, కార్మికులు, వ్యాపారవర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అయితే బుధవారం మధ్యాహ్నం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణపై అనుమానాలు వస్తున్నాయి. మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉండడంతో పాలకవర్గం తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. మార్కెటింగ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసిన దానినే పరిగణలోకి తీసుకుంటారా..? లేక మార్కెట్ కమిటీకి వెళ్లి చైర్‌పర్సన్‌గా సంతకం చేస్తేనే బాధ్యతలు చేపట్టినట్లు భావిస్తారా? అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సి ఉంది.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూసెంటర్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): పొగమంచు ఉన్న సమయంలో వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) సాయిచరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కురవిగేట్ సమీపంలో బుధవారం గేట్‌క్యాబ్స్, డీసీఎం అసోసియేషన్, డ్రైవర్లకు రోడ్డు భద్రత సెఫ్టీ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాయిచరణ్ మాట్లాడుతూ వాహనదారులు పొగమంచు ఉన్న సమయంలో డ్రైవింగ్ చేసేటప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించి జాగ్రత్తగా వాహనాలు నడపాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతీ డ్రైవర్ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాబ్‌డ్రైవర్లు, డీసీఎం అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని..
తల్లిదండ్రులు, గ్రామస్థుల ఆందోళన

- టీచర్‌పై దాడి, పోలీసులకు అప్పగింత
- హరిపిరాల హైస్కూల్లో ఘటన
- డీఈవో ఆదేశాలతో విచారణ

తొర్రూరు రూరల్, జనవరి29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ.. బాలికల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ ఘటన హరిపిరాల ఉన్నత పాఠశాలలో బుధవారం చోటు చేసుకుంది. మంగళవారం స్కూల్‌లోని విద్యార్థినులతో పలువురు ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ.. విద్యార్థినులు తమ తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులకు తెలుపడంతో ప్రధానోపాధ్యాయుడు బీవీ రావును, ఉపాధ్యాయులను నిలదీశారు. అక్కడే ఉన్న ఓ ఉపాధాయుడుపై దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకొని, ఠాణాకు తీసుకెళ్లారు. అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకో వాలని, పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేశారు. విద్యార్థులకు అండగా రక్షణగా ఉండాల్సిన ఉపాధ్యాయులు బాధ్యతారాహితంగా ప్రవర్తించడం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితులు



హరిపిరాల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్థులు

పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఉండడంతో ఉత్కంఠ నెలకొంది. కాగా, డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశాలతో విచారణ చేపట్టిన విచారణ అధికారి అనితాదేవి మాట్లాడుతూ ఉపాధ్యాయులపై వచ్చిన ఆరోపణలపై పాఠశాలలోని 7, 8, 9, 10 విద్యార్థినులతో, 12 మంది టీచర్లు, సిబ్బందిని విచారించి డీఈవోకు నివేదిస్తామని చెప్పారు. ఈ విషయంపై ఎస్సై ఉపేందర్‌ను వివరణ కోరగా, ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకున్నాం. స్కూల్ ఎదుట విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆందోళన చేస్తుండగా, విరమింపచేయించాం. కానీ, బాధితుల నుంచి ఫిర్యాదు రాలేదు. ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్సై వివరించారు.

'సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్ ఎస్సై కరుణాకర్ కోరారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు సైబర్‌నేరాలు పెరిగిపోతున్నాయని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచితుల నుంచి ఫోన్‌కాల్స్ మెసేజ్‌లు వచ్చినా వాటికి స్పందించవద్దన్నారు. ఈసదస్సులో ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్, అధ్యాపకులు అన్నపూర్ణ, అనిల్‌కుమార్, మసూద్‌అహ్మద్, సాంబశివరావు, రాజశేఖర్, హతిరామ్, ఖాసింషా, సుమన్, వీరు, సుమలత, నాగరాజు, ఉదయ్‌కుమార్, నరేష్, రామన్న పాల్గొన్నారు.

'గద్దర్‌పై వ్యాఖ్యలు సరికావు'



మాట్లాడుతున్న సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య

గూడూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పద్మశ్రీ అవార్డు ఎంపిక నేపథ్యంలో గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. గూడూరులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గద్దర్‌పై బండి చేసిన వ్యాఖ్యలను యావత్ భారతదేశ కళాకారులు, ఉద్యమకారులు, మేధావులు ఖండిస్తున్నట్లు చెప్పారు. గద్దర్ పదవుల కోసమో.. డబ్బు కోసమో.. అవార్డుల కోసమో.. తన జీవితాన్ని పనంగా పెట్టి పనిచేయలేదన్నారు. తెలంగాణ కోసం, పీడీత పేదల ప్రజల కోసం, అణగారిన వర్గాలు, మహిళల కోసం గద్దర్ తన గళం ద్వార పోరాటం చేశారని చెప్పారు. శరీరంలో బుల్లెట్లు ఉంచుకుని కూడ ప్రజల కోసం కొట్లాడిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. సంఘం జిల్లా అధ్యక్షులు మోకాళ్ల వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి జల్లి యాకయ్య, మండల అధ్యక్షుడు చుంచ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాట చరిత్రను తెలిపేందుకే దొడ్డి కొమురయ్య చిత్రం

- సినిమా నిర్మాణ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ



దొడ్డి కొమురయ్య సినిమా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దర్శకుడు, ప్రజా, కులసంఘాల నాయకులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం నాడు పోరాడి అమరులైన మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే సంకల్పంతో తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య సినిమాను నిర్మించినట్లు సినిమా నిర్మాణ కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షుడు, సహనిర్మాత డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బుధవారం దొడ్డికొమురయ్య సినిమా పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. నంతరం అంబేద్కర్ విగ్రహం నుంచి గంగపుత్ర భవనం వరకు ర్యాలీ చేపట్టి జిల్లాలోని 26 మంది సహ నిర్మాతలను సన్మానించారు. దర్శకుడు సేనాపతి, ప్రజా, కుల సంఘాల నాయకులు చిలువేరు సమ్మయ్య, వేముల వెంకన్న, కృష్ణప్రసాద్, లింగంపల్లి దయానంద్, టి.మురళీధరస్వామి, బొడ్డుపల్లి ఉపేంద్రం, బండారు వెంకటరమణ, గుగ్గిళ్ల పీరయ్య, కొండ్ర ఎల్లయ్య, పిల్లి సుధాకర్, సక్కశ్రీను, విజయ్‌కుమార్, నీరుటి స్యామెల్, దుడ్డెల రాంమూర్తి, దైద భద్రయ్య, గుంజె హన్మంతు, నాజర్, బూర్గులలక్ష్మణ్, రామగిరి చంద్రయ్య, తోట లాలయ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై అధికారుల నజర్

- కిరాణ షాపుల్లో దాడులు
- కవర్లు విక్రయిస్తున్న దుకాణాలకు జరిమానా



కిరాణషాపులో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న మునిసిపల్ సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలో ప్లాస్టిక్ నిర్మూలనపై మునిసిపల్ అధికారులు దృష్టి సారించారు. గతంలో అనేకమార్లు షాపులపై దాడులు నిర్వహించి ప్లాస్టిక్‌కవర్లు అమ్ముతున్న షాపు యాజమానులకు జరిమానాలు విధించి కొంత కట్టడి చేశారు. జిల్లా కేంద్రంలో మళ్లీ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు పెరుగుతుండడంతో మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ ఆదేశాలతో బుధవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ నేతృత్వంలో కిరాణషాపులపై దాడులు నిర్వహించారు. వివిధ షాపుల్లో విక్రయిస్తున్న 900 కేజీల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని షాపు యాజమానులకు రూ.10 వేల జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్‌పెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకంతో అనేక అనర్థాలున్నాయని, అందుకోసం ప్లాస్టిక్ కవర్లను ఎవరూ వాడవద్దని సూచించారు. షాపుల్లో ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ క్రాంతి, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- చిట్యాల హెచ్‌ఎం విజయకుమార్

పెద్దవంగర, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ఆఫ్‌సేవా తరుణి తొర్రూరు సేవలు అభినందనీయమని చిట్యాల హెచ్‌ఎం ఎర్రోజు విజయకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి తొర్రూరు అధ్యక్షురాలు మాధవిపెద్ది వాణి ఆధ్వర్యంలో రూ.10వేలతో విద్యార్థులకు స్టడీ చైర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నవ సమాజ నిర్మాణానికి లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి తొర్రూరు సేవలు ఎంతో అవసరమన్నారు. అలాగే రామంచంద్రు తండా ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం చిక్కాల సతీష్‌యాదవ్ రూ.7వేలతో చిన్నవంగర ప్రాథమిక పాఠశాలకు గ్రీన్ బోర్డులను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న సతీష్ సేవలను ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉమాదేవి, రజిత, శైలజ, రమేష్, కోటేశ్వర్, సురేందర్, ప్రభాకర్, యుగేందర్, మల్లేశ్, కరుణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి

- మృతి చెందిన కూలీల పేర్లపై డబ్బుల స్వాహా

మహబూబాబాద్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం జంగిలిగొండ గ్రామంలో 2021 సంవత్సరంలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో అవినీతి అక్రమాలు జరిగినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. 2021 సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పథకంలో మృతి చెందిన కూలీల పేర్లను జాబ్‌కార్డు నుంచి తొలగించకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమారు 10మంది పేర్లపై రూ.లక్షల్లో సొమ్ము కాజేసినట్లు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మహబూబాబాద్ ఎంపీడీవో రఘుపతిరెడ్డిని వివరణ కోరగా గ్రామస్థులు ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.



సభలో వేతనాలు, ఖర్చుల వివరాలను వివరిస్తున్న అడిట్ బృందం

ఈజీఎస్ పనులపై అధికారుల పర్యవేక్షణ కరువు

గార్ల, (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా 2024-2025 ఆర్థిక సవంత్సరంలో గ్రామాల్లో జరిగిన జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో మస్టర్లు తప్పుడు తడకగా తయారు చేసి, కూలీలకు వేతనాలు అందజేయడం జరిగిందని సోషల్ అడిట్ బృందం తమ సర్వేలో తేల్చారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక గ్రామసభను నిర్వహించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో సుమారు రూ. 35, 3,999 లక్షలగాను పలు గ్రామాల్లో కూలీల మస్టర్లు తప్పులు చూపి వేతనాలు విడుదల చేసినట్లు సర్వేలో తెలిందని, దీనికి స్థానిక అధికారులు వేతనాలు విడుదలకు సహకరించారని సభ్యులు వెల్లడించారు. వేతనాలు విడుదలకు సహకరించిన ఆయా ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి డబ్బులను రీకవరి చేయాలని అధికారులు ఆదేశించారు. పీడీ, మధుసుదన్‌రాజు, లబుస్, యాకుబ్,అంజాగౌడ్, నాగరాజు ఏపీవో సృజన్ స్వరుప్ పాల్గొన్నారు.



మానుకోటలో ఆర్యూబీ వద్ద రేకులతో మూసివేసిన రహదారి

ఆర్యూబీ నుంచి రాకపోకల బంద్

మహబూబాబాద్ టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రైల్వే మూడోలైన్ పనుల నేపథ్యంలో మహబూబాబాద్ రైల్వే అండర్ బ్రిడ్జీ (ఆర్యూబీ) గుండా బుధవారం రాత్రి రాకపోకలను సంబంధిత అధికారులు నిలిపివేశారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 20 వరకు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఇప్పటికే రైల్వేశాఖ అధికారులు బోర్డును ఏర్పాటు చేశారు. తాజాగా ఆర్యూబీకి రెండు వైపులా రేకులను అమర్చి వాహనరాకపోకలను నిలిపి వేశారు. ఇక మహబూబాబాద్ పట్టణంలో కొత్త, పాత బజారులకు వెళ్లాలంటే అటు ఏ-క్యాబిన్ రైల్వే గేట్, ఇటు కురవిరోడ్‌లోని రైల్వే ఓవర్‌బ్రిడ్జీ (ఆర్వోబీ) గుండా వాహనదారులు రాకపోకలు కొనసాగించాల్సి ఉంటుంది.

వరిలో తెగుళ్ల నివారణపై అవగాహన

కేసముద్రం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం కేసముద్రం రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీవో), క్రిబ్‌కో రాష్ట్ర ఎండీ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో వరిలో తెగుళ్ల నివారణపై కృషి విజ్ఞాన కేంద్రం మల్యాల శాస్త్రవేత్త మాలతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్న చిన్న చిట్కాల ద్వారా తక్కువ పెట్టుబడితో తెగుళ్లను నివారించే విధానాలను వివరించారు. ఎఫ్‌పీవో డైరెక్టర్లు సంకు శ్రీపాల్‌రెడ్డి, పొదిల నర్సింహారెడ్డి, శ్రీనివాస్, బండి వెంకన్న, జూకంటి కుమారస్వామి, ఏఈవో లావణ్య పాల్గొన్నారు.

పూలమొక్కలు బహూకరణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థినులు విద్యనభ్యసించేందుకు పూలమొక్కలు దాత ఇస్లావత్ రమేష్ అందజేసినట్లు ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం అన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పొక్కుల సదానందంకు రూ. 10 వేల విలువ గల పూలమొక్కలను రమేష్ అందజేశారు. కళాశాలకు రూ. 10వేల విలువగల పూలమొక్కలను అందజేసిన రమేష్‌కు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా దాతలు ముందుకు వచ్చి కళాశాల అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. అధ్యాపకులు రియాజ్, రవి కిరణ్, చొప్పరి శ్రీనివాస్, శ్రీను, నవీన్, సరిత, భార్గవి, సృజన, సురేందర్, పర్వీన్ బేగం, స్వాతి, కిరణ్‌కుమార్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జైన మందిరాన్ని సందర్శించిన కేరళ క్యాడర్ ఐజీ



జైన మందిరంలో పూజలు నిర్వహిస్తున్న కేరళ క్యాడర్ ఐజీ లక్ష్మణ్‌నాయక్

డోర్నకల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలో జైన మందిరాన్ని కేరళ క్యాడర్ ఐజీ లక్ష్మణ్‌నాయక్ బుధవారం సందర్శించారు. తన చిన్ననాటి స్నేహితులైన సుశీల్‌కుమార్‌జైన్ ఆహ్వానం మేరకు ఆయన మందిరాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. పాలరాతితో నిర్మించిన ఆలయం అత్యద్భుతంగా ఉందన్నారు. ఆలయ ప్రాంగణమంతా కలియ దిరిగారు. ఐజీ వెంట జైన మత పెద్దలు రాజ్ కుమార్‌జైన్, సుమీర్‌చంద్‌జైన్,స్థానికులు మాద శ్రీనివాస్, గుండ్రాల భాస్కర్, శ్రీనివాస్‌నాయక్, షైనూపాషా, సెట్‌రాంనాయక్, నంద్యనాయక్, అభిషేక్‌లు, గోలియానాయక్ ఉన్నారు. అనంతరం లక్ష్మణ్‌నాయక్‌ను జైనమత పెద్దలు శాలువతో సత్కరించారు.

'పెంకు కార్మికుల వేతనాలను పెంచాలి'

బయ్యారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో గల పెంకు కార్మికుల వేతనాలు తక్షణమే పెంచాలని తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అరెళ్లి క్రిష్ణ పెంకు పరిశ్రమల యజమానులను డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు పెరుగుదల విషయంలో యజమానులు అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ బయ్యారంలో బుధవారం ప్రదర్శన చేపట్టి తహసీల్దార్ విజయకు వినతిపత్రం అందజేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలకు సంబంధించిన ఒప్పందం గత ఏడాది డిసెంబర్‌తో ముగిసిందన్నారు. మరల కొత్త ఒప్పందం కోసం యజమానులకు డిమాండ్ నోటీస్ ఇచ్చి 15 రోజులైనా వేతనాల పెరుగుదల విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ కార్మిక ఆర్డినెన్స్ ప్రకారం కార్మికుల నెలసరి వేతనం రూ. 26 వేలు ఉండాలన్నారు. ఇప్పటికైన యజమానులు స్పందించి కార్మికుల వేతనాల పెరుగుదలకు చర్యలు చేపట్టకపోతే సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రాంసింగ్, ప్రధాన కార్యదర్శి మదార్, నాయకులు, కార్మికులు రాంబాబు, లింగయ్య, శ్రీరాములు, స్వరూప, వెంకట్‌రామ్, రవి, శివ, శంకర్, దుర్గా, ఆదినారాయణ, కొమరయ్య, లక్ష్మీనారాయణ, సత్తిబాబు, సత్యవతి, సంక్రు, సారయ్య పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో మానుకోట జట్టు ప్రథమ స్థానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించిన ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ అండర్-14 విభాగంలో జరిగిన పోటీల్లో మహబూబాబాద్ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు కోచ్ వెలిశాల కుమారస్వామి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల బాస్కెట్ బాల్ క్రీడామైదానంలో జట్టును అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ కుమారస్వామి, అసోసియేషన్ బాధ్యులు ముల్లంగి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిఛ రూ. 10 వేల నగదు బహుమతి పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు చీకటి చంద్రయ్య, కాశీనాథ్, కమల్‌కిషోర్, యాకయ్య, మోహన్, శ్రీనివాస్, అనిల్, రామకృష్ణ, సూచనరాయ్ పాల్గొన్నారు.

నేడు, రేపు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఏకశిలా ఏంజిల్స్ హై స్కూల్‌లో ఈనెల 30, 31 తేదీల్లో కెరీర్ గైడెన్స్‌పై స్ట్రాంగ్ టీచర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలను నుండి ఒక ఉపాధ్యాయుడి చొప్పున శిక్షణకు పంపించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఉదయం 9 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని, సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అందచేత



బాధితుడికి సెల్ ఫోన్ అందచేస్తున్న ఎస్సై సతీశ్

మరిపెడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కొద్దిరోజుల క్రితం మరిపెడ బస్టాండ్ సెంటర్‌లోని కార్గో సేవకుడి నుంచి చోరీకి గురైన ఐఫోన్‌ను మరిపెడ పోలీసులు ట్రేస్‌చేసి బుధవారం బాధితుడికి అందచేశారు. ఎస్సై బోలగాని సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం... మరిపెడబంగ్లాలోని వీకేకే సెల్ షాపు నిర్వహకుడు కిరణ్ కస్టమర్ కోరిక మేరకు వరంగల్ నుంచి ఐఫోన్‌ను ఆర్డర్ చేసి కార్గో సర్వీస్ ద్వారా మరిపెడకు ట్రాన్స్‌పోర్ట్ చేశారు. కార్గో నుంచి దిగుమతి చేసుకొని నిర్వాహకుడికి అందచేసే క్రమంలో కార్గో సేవకుడి నుంచి ఆ ఐఫోన్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆ ఫోన్ ట్రేస్ చేసి బాధితుడికి అందజేసినట్లు ఎస్సై తెలిపారు. చోరీకి గురైన ఫోన్ దొరకడంతో బాధిత కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

తొర్రూరురూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో మహంకాళి బుచ్చయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు విద్యార్థుల విషయ సాధన, వివిధ అంశాలపై అడిగి తెలుసుకొని మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, నైపుణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. హెచ్‌ఎం హరిత, ఉపాధ్యాయులు ఉన్నారు.

అమావాస్య అన్నదానం

తొర్రూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మౌని అమావాస్య సందర్భంగా బుధవారం పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘాలు, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌరీశంకర్ మాట్లాడుతూ మౌని అమావాస్య హిందువులకు ప్రత్యేకం అన్నారు. అమావాస్య రోజు అన్నదానం, బ్రాహ్మణులకు భోజన వసతి, పిండప్రదానం, నదీ స్నానం వంటి కార్యక్రమాలు చేపట్టడం హిందూ సంప్రదాయమని అన్నారు. ప్రతీ అమావాస్యకు ఆర్యవైశ్య సంఘం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపడతామన్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్, ఇమ్మడి రాంబాబు, చిదిరాల శ్రీను, గోపారపు నిరంజన్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

కొత్తగూడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేసి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. కొత్తగూడలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం లబ్ధిదారుల ఎంపికకు నిర్వహించిన గ్రామసభలను ప్రభుత్వం అవమానపరిచిందని విమర్శించారు. గ్రామసభల్లో లబ్ధిదారులను ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. ప్రజలందరికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం కొత్తగూడ, గంగారం మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్, డివిజన్ నాయకుడు గొంది సమ్మయ్య, ఈక భిక్షం, కురుసం రంగయ్య, కంగాల పాపయ్య, కల్తీ ఎర్రక్క, నాయకులు పాల్గొన్నార

'రుణాలు మంజూరును నిలిపివేశాం'

డోర్నకల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : యాదవనగర్‌లో ఉన్న వెలుగు గ్రామైక్య సంఘంలోని ఆదర్శ మహిళ పొదుపు సంఘం ఖాతాలోకి లోను మంజూరును నిలిపివేసినట్లు డోర్నకల్ ఎస్‌బీఐ మేనేజర్ సుధాకర్ బుధవారం తెలిపారు. ఆదర్శ గ్రూప్ ప్రధాన లీడర్ మూడునెలల క్రితం విదేశాలకు వెళ్లారని, ఈ తరుణంలో ఆమె లేకుండా గ్రూప్‌కు లోను మంజూరు చేశారని, నిబంధనలకు ఇది పూర్తి విరుద్ధమని, ఈ విషయమై కలెక్టర్‌కు, మెప్మా డీఎంసీ విజయ, మునిసిపల్ కమిషనర్ వెంకటస్వామి, ఎస్బీఐ మేనేజర్ సుధాకర్‌కు సలీమా అనే మహిళ ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్బీఐ మేనేజర్‌ను వివరణ కోరగా మహిళ సంఘానికి లోను మంజూరైంది కానీ, డబ్బులను గ్రూప్ సభ్యుల వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయలేదని చెప్పారు. వాటిని హోల్డ్‌లో ఉంచినట్లు వివరణ ఇచ్చారు. డీఎంసీ విజయని వివరణ కోరగా ఆర్పీ ద్వారా ఏమైనా తప్పు జరిగితే అతడికి మెమో జారీ చేస్తామని చెప్పారు. మునిసిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా సదరు మహిళ బుధవారం తనకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిపై విచారణ చేస్తున్నట్లు కమిషనర్ వెంకటస్వామి తెలిపారు.

విద్యుత్ తీగలు తెగిపడి మహిళకు గాయాలు

గంగారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగలు తెగిపడి గిరిజన మహిళకు తీవ్రగాయాలైన ఘటన గంగారంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా రామన్నగూడెంకు చెందిన పెనక సారక్క(60)కుమార్తె జెజ్జరి సుజాత ఇంటికి వచ్చింది. సుజాత పిల్లలు అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్నారని తెలిసి పిల్లలను చూసేందుకు హాస్టల్ గుంపులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వెల్లంది. ఈ క్రమంలో విద్యుత్ తీగలు తెగి ఆమెపై పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గంగారంకు సెలవుపై ఇంటికి వచ్చిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ రమేష్ సారక్కకు సీఆర్‌పీ చేయటంతో ఆమె స్పృహలోకి వచ్చింది. గాయాలపాలైన అమెను మెరుగైన వైద్యం కోసం నర్సంపేట వైద్యశాలకు తరలించారు.

రాష్ట్రస్థాయి క్రీడోత్సవాల్లో జిల్లాకు బంగారు పతకం

- 10 కి.మీ పరుగు పందెంలో లింగన్న ప్రతిభ

మహబూబాబాద్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లింగన్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడోత్సవాల్లో బంగారు పతకం సాధించాడు. ఈ నెల 28న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి 3వ పోలీస్ క్రీడోత్సవాల్లో 10 కిలోమీటర్ల పరుగుపందెంను 34 నిమిషాల్లోనే పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. రాష్ట్రస్థాయి క్రీడల్లో జిల్లాకు బంగారు పతకం సాధిం చి మంచిపేరు తీసుకువచ్చిన లింగన్నను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ బుధవారం అభినందించారు.

వంద విజయాల ఇస్రోకు వందనం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వంద విజయాల ఇస్రోకు వందనం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు అన్నారు. మహబూబాబాద్‌లోని గాదెరుక్మారెడ్డి మెమోరియల్ హైస్కూల్‌లో బుధవారం ఇస్రో ప్రయోగించిన రాకెట్ విజయవంతం కావడాన్ని పురస్కరించుకొని వంద విజయాల ఇస్రోకు వందనం అనే బ్యానర్‌తో విజయ సంకేతం చూపుతూ సంబరాలు జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి, డైరెక్టర్లు రీనాగోపికృష్ణ, రజితామాధవ్, బాలరాజు, రఘు, హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎంఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రేమ్‌కుమార్

కేసముద్రం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మాల మహానాడు మానుకోట జిల్లా ప్రధాన కార్యదర్శిగా కేసముద్రంస్టేషన్‌కు చెందిన బెజ్జం ప్రేమ్‌కుమార్‌ను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ ప్రధాన కార్యదర్శి భాస్కర్, పొలిట్‌బ్యూరో సభ్యుడు బెజ్జం ఐలేష్, రాష్ట్ర నాయకుడు బెజ్జం రమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.